# సంఘం శరణం గచ్ఛామి

గరిమెళ్ళ వెంకట సీతారాం



"ఏమండీ, వచ్చే వారం మొదటి శ్రావణ శుక్రవారమండీ."

"అవును, తెలుసు."

"అత్తగారు, మామగారు పోయేక మనమే ఇంటికి పెద్దవాళ్ళం."

"అది కూడా తెలుసు."

"మా తమ్ముడి భార్యకు ఇదే మొదటి శ్రావణ శుక్రవారం."

"అయితే చక్కగా పూజ చేసుకోమని ఉత్తరం వ్రాయి."

"ఆ పూజ మనం చేయించాలండీ."

"అని ఎవరు చెప్పేరు?"

"ఎవరు చెప్పటమేమిటి! మొదటి సంవత్సరం పూజ అత్తింటి వారు చేయించాలి. అది పద్ధతి."

"అయితే సరే, పిలిపించి పూజ చేయించు."

"ఒట్టి పూజ సరిపోదండి. కనీసం కాసు బంగారమైనా పెట్టాలి. పట్టుచీరె కొనాలి. లేకపోతే వియ్యంకుల వాళ్ళు తప్పు పడతారు."

* * * *

భాస్కరం హైస్కూలు టీచరు. భార్య సరస్వతి. పెళ్ళయి అయిదేళ్ళయి ఇంకా పిల్లలు కలగలేదు. పొదుపుగా, చక్కగా సంసారం చేసుకుంటున్నారు. తమ్ముడు ప్రసాద్ పొరుగు రాష్ట్రంలో గవర్నమెంటు ఉద్యోగి. తమ్ముడంటే భాస్కరానికి అపారమైన ప్రేమ. చిన్నప్పటి నుండి తన దగ్గరే పెరిగేడు. బి. ఏ. ప్యాసయి ఉద్యోగం సంపాదించేక కొన్నాక ఈ సంవత్సరమే పెళ్ళయింది.

కాసు బంగారంతోను, నాలుగు వందల రూపాయల పట్టు చీరె తోను, పదిహేను రూపాయల పురోహితుని ఖర్చుతోను మొదటి శ్రావణ శుక్రవారం పూజ ముగిసింది.

తమ్ముడు చిన్నప్పటి నుండి తన కొడుకులా తన దగ్గర పెరిగేడు గాబట్టి, ఆ రోజు తమ్ముడి భార్యను పిలిచి పసుపు కుంకం. పట్టుచీరె పెట్టి, పూజ చేయించటంలో ఎంతో ఆనందం పొందేరు భాస్కరం, సరస్వతి తాత ముత్తాతల నుండి సంక్రమించిన ఆచార వ్యవహారాలకు కట్టుబడి పై వాళ్ళెవరూ తప్పు పట్టకుండా సంఘంలో వంశ మర్యాద నిలబెట్టేమనే తృప్తిని కూడా పొందేరు భాస్కరం, సరస్వతి.

* * * *

"ఎవరూ ఆ వచ్చిన వాళ్ళు?"

"పక్కవీధిలో డాక్టరు గారి భార్య."

"ఏంటి విశేషం?"

"వాళ్ళమ్మాయి పుట్టిన రోజట. పిలవటానికి వచ్చేరు."

"వెళ్తున్నావా?"

"పిలిచేక వెళ్ళకపోతే బాగుండదు. నలుగురితో పాటు మనం."

"సర్లే, వెళ్ళి చీకటి పడకుండా వచ్చెయ్యి".

"ఒట్టి చేతులతో వెళ్తే బాగుండదండి. ఏదైనా గౌనుగుడ్డో, ఆట వస్తువో పట్టుకెళ్ళాలి."

"చిన్నపిల్ల అయి ఉంటే బిస్కట్ల పొట్లాంతో సరిపోయి ఉండేది. ఆ పదేళ్ళ పిల్లకు గౌను గుడ్డ కొనాలంటే కనీసం ఇరవై అయినా అవుతుంది."

"సంఘంలో బ్రతుకుతున్నప్పుడు ఇలాంటి ఖర్చులు తప్పవండి!"

* * *

భాస్కరం ఆలోచనల్లో పడ్డాడు.

ఏంటో అర్థం లేని ఆచారాలు. డబ్బు ఖర్చుగాని ఆచారం కాని వేడుకగాని లేదు కదా. ఏమైనా అంటే సంఘంలో బ్రతుకుతున్నాం అంటుంది సరం. సంఘం అంటే ఏమిటి? తనలాంటి వాళ్ళం దరూ కలిస్తేనే గదా ఆ సంఘం అవుతుంది. మరి తనలాంటి వాళ్ళు అలాంటి ఆచారాలకు ఎందుకు స్వస్తి చెప్పకూడదు? చెప్పలేరు. ఎందుచేత? సంఘం వేలెత్తి చూపుతుంది. పిసినారి అంటుంది. ముద్దూముచ్చటా తెలీదంటుంది. కాని నెల జీతంలో చాలా భాగం ఇలాంటి అర్థం లేని వేడుకలకే ఖర్చు అయిపోతుందన్న సంగతి ఎవరూ గ్రహించరు. తనంటే నెగ్గుకొస్తున్నాడు పిల్లా పీచు ఇంకా లేరు కాబట్టి. పిల్లా పాపలతో సంసారాలు ఈదుకొస్తున్న అనేక మధ్య తరగతి కుటుంబాలు కూడా ఈ వేడుకలు, కానుకల బారి నుండి తప్పించుకోలేక సతమతమవుతున్నాయి.

* * * *

డాక్టరు గారమ్మాయి పుట్టిన దినం బాగానే జరిగింది. పిలిచిన వాళ్ళందరికీ అరప్లేటు మిక్చరు, ఒక అరటిపండు, అరకప్పు టీ ఇచ్చి, వచ్చిన ప్రతివారి దగ్గర ఇరవై మొదలుకొని ఏభై రూపాయల విలువగల ప్రెజెంటేషన్స్ సంపాదించుకొని డాక్టరు గారి కుటుంబం తమ ఆస్తి విలువను ఆ ఏడాది ఇంకో మెట్టు మీదకు తీసుకెళ్ళగలిగితే ఆ రెండు వీధుల కుటుంబాల ఆ నెల బడ్జెట్టు సగటున ముప్ఫై రూపాయలు లోటు చేసుకొంది.

* * *

"నమస్కారమండీ!"

"ఓహో! కల్యాణరావుగారా! రండి, రండి,

క్షేమంగా ఉన్నారా?"

"మీకు శుభవార్త చెప్పటానికి వచ్చేను. మీ శిష్యుడు రామానికి వచ్చే ఆదివారం కల్యాణం. మీరు సకుటుంబ సపరివారంగా వచ్చి వధూవరులను ఆశీర్వదించ ప్రార్థన."

"ఏమిటీ, రామానికి పెళ్ళా! అప్పుడే ఎంత పెద్దవా డయ్యేడు. మంచి శుభవార్త చెప్పేరు. తప్పకుండా వస్తాము."

* * *

"ఇదిగో, విన్నావా?"

"ఏంటి?"

"మనింటికి చదువుకోనటానికి వచ్చేవాడు. పొట్టిగా, నిక్కరు జారిపోతూ — రామం — వాడికి పెళ్ళి. వాళ్ళ నాన్న గారు స్వయంగా వచ్చి పిలిచేరు."

"శిష్యుడి పెళ్ళి అంటే మనింట్లో పెళ్ళిలా మురిసిపోతున్నారు."

"కాదుటే— మన ముందర పెరిగేడు."

"అలా అని చెప్పి కట్నం, కానుక చదివించకుండా అక్షింతలు చల్లి వచ్చేస్తే నలుగురూ నవ్వుతారు."

* * *

మళ్ళీ ఆలోచనలు భాస్కరం మెదడులో. సరం చెప్పిన మాట కూడా నిజమే. పెళ్ళికి వచ్చిన పది మంది కట్నాలు చదివిస్తుంటే మనం అక్షింతలు చల్లేసి తువ్వాలు దులుపుకుని వచ్చేస్తే నలుగురూ ఏమనుకొంటారు? ఎంతో కొంతకట్నం చదివించి తీరాలి సరం చెప్పినట్టు. అయితే తన దగ్గర విద్య నభ్యసించిన ప్రతి విద్యార్థికి పెళ్ళి జరుగుతుంది కదా. అందుబాటులో ఉన్న వాళ్ళందరూ తనను ఆ పెళ్ళిళ్ళకు తప్పక ఆహ్వానిస్తారు. ఆహ్వానించేక వెళ్ళక పోతే బాగుండదు కదా. పిలిచిన ప్రతి పెళ్ళికి వెళ్ళి కట్నం చదివించాలంటే, ఒక్క జీతం పైనే ఆధారపడిన తనకు వీలవుతుందా? అక్షింతలూ, మనఃస్ఫూర్తిగా అందజేసిన ఆశీస్సుల కన్నా గొప్పదైన కానుక ఇంకేముంటుంది? కాని ఆ అక్షింతలకు, ఆశీస్సులకు డబ్బు విలువ లేదు కదా!

* * *

భాస్కరం సాయంత్రం స్కూలు నుండి రాగానే వసారాలో కూర్చుని పొడుం పీలుస్తున్న పురోహితుడు కనిపించాడు. పురోహితుడే భాస్కరాన్ని పలకరించాడు.

"అయ్యా, వచ్చారా. తమ గురించే వెయిట్ చేస్తున్నా. వారం రోజుల నుండి వద్దామని ప్రయత్నం. ఇది సీజను కదండి. సందింట్లోనో ఒక రింట్లో ఏదో కార్యం. కిందటి శుక్రవారం సుబ్బిసెట్టి గారింట్లో లక్ష ప్రత్తి నోము. ఆ కిందటి రోజు డాక్టరుగారి దంపతులచే సహస్ర నామ పూజ. సంతర్పణ వగైరా. మొన్న ఇంజనీరు గారింట్లో సత్యనారాయణ వ్రతం. ఆ తరవాత రోజు శేషగిరి గారి కొడుక్కి అన్నప్రాశనం. లాయరుగారి మనుమరాలికి సీమంతం. అడక్కండి, బాబూ. ఊపిరి తిరక్కుండా చస్తున్నా నంటే నమ్మండి. ఇవాళ్టికి కాని తీరిక చిక్కలేదు."

"ఏంటి విశేషాలు?"

"మరేం లేదు. వచ్చే సోమవారం తమ అమ్మగారి ఆబ్దికం. ఒక సారి గుర్తు చేసి పోదామని వచ్చాను."

"పంతులుగారూ, ఆబ్దికం అంటే ఏమిటండీ?" అక్కడే ఉన్న పక్కింటి వాళ్ళ చిన్న అమ్మాయి వేసిన చిన్న ప్రశ్న.

"ఆబ్దికం అంటే ఆ రోజున మాస్టారు అమ్మగారు చనిపోయారు కదా. ఆ అమ్మగారు వచ్చి వీరింట్లో భోజనం చేస్తారు. తెలిసిందా?"

* * * *


ఆ వచ్చే సోమవారం ఏభై రూపాయల ఖర్చుతో ఆబ్దికం ముగిసింది. వేడుకలు, కానుకలు అని చెప్పి ప్రతి నెలా డబ్బు తగలెయ్యటంలో కన్నా, ఏడాదికో సారి ఆబ్దికం పేరు చెప్పి చనిపోయిన తల్లిదండ్రులను తలుచుకుని తన ఉనికికి కారణభూతులైన పార్వతీ పరమేశ్వరు లాంటి తల్లి తండ్రులకు జోహార్లు అర్పించటంలో ఎంతో ఆనందం, తృప్తి ఉందనుకున్నాడు భాస్కరం.

భాస్కరం, సరస్వతిలకు జాతక నెరవటం మొదలైంది. పెళ్ళయిన మొదటి రోజుల్లో ఒకటి ఇప్పుడిప్పుడే వద్దు, రెండు తరవాత చూసుకుందాం— మూడు అసలే వద్దు అనే ఫామిలీ ప్లానింగ్ నినాదాలు లేవు. అంతా దైవేచ్ఛ ప్రకారం జరిగేది. అలా అలా నలుగురు ఆడపిల్లలు, నలుగురు మగ పిల్లలు పుట్టుకొచ్చారు భాస్కరం, సరస్వతులకు. అందరి మాదిరే పిల్లల పేరు పెట్టి అనేక వేడుకలు చేసుకున్నారు భాస్కరం, సరస్వతులు. బాలసారెలు ఉయ్యాల పెట్టడాలు, భోగి పళ్ళు పొయ్యటాలు అన్న ప్రాశనాలు, ఉపనయనాలు ఇలా అనేక వేడుకల మధ్య కాలం దొర్లుతూనే ఉంది. పెద్ద పిల్ల రమకి పెళ్ళికూడా అయింది.

* * *

"ఏమండీ, పండక్కి అల్లుడ్ని, అమ్మాయిని రమ్మని ఉత్తరం వ్రాశారా?"

"నో! రెండు రోజుల క్రితమే వ్రాశాను."




స్వాతంత్ర్యం వచ్చి ఇరవై ఏళ్ళ పైన అయింది. కాలం ఎవరి నిమిత్తం ఆగదు. ఈ ఇరవై ఏళ్ళ లోను దేశం ఎంతో ముందుకు వెళ్ళింది. ఎన్నో పరిశ్రమలు, ఎన్నో సంస్థలు, ఎంతో హంగామా, హడావిడి—పరుగులు—పల్లెలు పట్నాలై రూపు దిద్దుకోవాలని తహతహ—ఒకప్పటి కోరికలు ఇప్పుడు అవసరాలై కూర్చున్నాయి. ఇప్పటి వాంఛలు గుర్రాలై పరిగెడుతున్నాయి. అన్నిటి లోను పెరుగుదల కనబడుతూంది—ముఖ్యంగా జనాభా విషయంలోను, ధరల విషయంలోను. పైన్సు ప్రక్రియలకు అందుబాటులో లేకుండా పెరిగి పోతున్న జనాభా, వాళ్ళ అవసరాలకు తగ్గట్టు ఉత్పత్తి పెరుగుదల లేకపోవడం, కొనుగోలు ధరం పెరుగుదల, రూపాయి విలువ తగ్గదల—ఇవన్నీకూడా ప్రగతి సూచకాలే అని అంటారు మన నాయకులు. ఏది ఏమైనా పిడపర్తి వారి కొత్త కేలండర్లు పాత వాటి స్థానంలో వస్తూనే ఉన్నాయి, కాలం మార్పును గుర్తు చేస్తూ.

* * *

"నిజంగా నేనా?"

"అబద్ధం అని ఎందుకు అనుకొంటున్నావ్?"

"అప్పే, అడిగాను."

"సరం! పెళ్ళయి మొదటి సంవత్సరం అమ్మాయి, అల్లుడు పండక్కి వస్తుంటే నాకు మాత్రం సంతోషంగా ఉండదుటే!"

"అది సర్లెండి—పండక్కి కావలసిన సామానులు పట్టుకొని రావాలి. మార్కెట్టులోకి ఆర్గండీ చీరెలు వచ్చాయిట. అమ్మాయి రమకు లెమన్ కలర్ అంటే ఇష్టం."

"సరూ, ఆ చీరెల సంగతి నాకు తెలీదు. డబ్బిచ్చేస్తాను— ప్రొద్దుటి మహాలక్ష్మిగారిని తీసుకెళ్ళి నువ్వే కొనుక్కో."

* * * *

సరస్వతికి ఈ ఆచారాలు ఎంతో నచ్చేయి. పండగ పేరు చెప్పి అమ్మాయి, అల్లుడు వచ్చి పది రోజులు ఇంట్లో ఉంటే ఇల్లు ఎంతో కళ కళ్ళాడుతుంది. మనుషులు దగ్గరవటానికి, మన

తలు పెంచుకోటానికి ఈ పండగలు ఎంతో దోహదం చేస్తాయి. అనురాగాలు పెరుగుతాయి. సంవత్సరంలో వచ్చే ప్రతి పండక్కి అమ్మాయినీ అల్లుడ్నీ పిలిస్తే ఎంతో బాగుంటుంది. కాని ఎవరూ అలా అన్ని పండగలకు అల్లుళ్ళను పిలవరు కదా. అందరూ నడిచిన దారినే మనం నడవాలి కదా. ఇవి సరస్వతి ఆలోచనలు.

* * *

కాలం పరుగెడుతూనే ఉంది. భాస్కరం పిల్లలు పెద్ద వాళ్ళు అవుతున్నారు. వాళ్ళకు బట్టలు, చదువులు, స్కూలు జీతాల ఖర్చులు ఎక్కువయ్యాయి. ధరలు ఆకాశాన్నందుకొంటున్నాయి. ఆ నిష్పత్తిలో జీతాలు పెరగటం లేదు సరికదా, నెల సరిగా జీతాలు అందటం లేదు. గవర్నమెంటు వారు గ్రాంటు ఇవ్వటం లేదంటారు. స్కూలు మేనేజిమెంటు—ట్యూషన్‌లు చెప్పకూడదని ఆంక్ష. అత్తగారు తను పెట్టదు, ఇంకొకర్ని పెట్టనివ్వదు అన్నట్టు ఉంది. కొంతమంది మాస్టర్లు తెలిసీ తెలీకుండా ట్యూషన్‌లు చెప్పుకొంటున్నారు. వస్తారా మరి. జీవితం గడవాలి కదా. మరి కొంత మంది పరీక్షల్లో మార్కులు వేయిస్తామని అవినీతి మార్గాల్లో వెళ్ళుతున్నారు. అసలు నీతి ఎక్కడుంది గనుక? ఆ నీతికి మన నాయకులే ఎప్పుడో సమాధి కట్టేశారు. భాస్కరం అలాంటి పనులు చెయ్యలేడు. భాస్కరం ఆలోచనలే వేరు. తక్కిన ఉద్యోగాలకీ, అధ్యాపకుని ఉద్యోగానికీ ఎంతో తేడా ఉంది. మేష్టర్లకు భావి పౌరులను తీర్చిదిద్దే బాధ్యత అప్పచెప్పబడింది. అదొక అమూల్యమైన దేశ సేవ. ఈ బాధ్యతకు విలువ కట్టడం సాధ్యం కాని పని. ఇలాంటి గురుతర బాధ్యత నిర్వహించటంలో అవినీతికి చోటు ఉండ కూడదు. అందుచేతనే ఎమ్.ఎల్.ఎ. కొడుకైనా సరే, మినిష్టరు గారమ్మాయి అయినా సరే సరిగ్గా చదవక, జాగ్రత్తగా ప్రవర్తించకపోతే అదుపులో పెట్టటానికి జంకడు. తనకు తానుగా ఒక వ్యక్తిత్వం గల మనిషి. అందరి చేత 'ఓహో' అనిపించుకునే వ్యక్తి. అందరిచేత నమస్కారం పెట్టించుకోగల వ్యక్తి. అందరి మన్ననలను పొందే వ్యక్తి. స్ఫటికంలా మెరిసే నీతి గల వ్యక్తి. అయితే ఈ ఓహోలు, ఈ నమస్కారాలు, ఈ మన్ననలు, స్ఫటికంలాంటి ఆ నీతి అతని సంసారం అవసరాలు తీర్చలేకుండా ఉన్నాయి.

తనూ ఇంటి దగ్గర పాఠాలు చెప్తాడు. కాని ఎవరికి? బీద పిల్లలకు, స్కూల్లో బోధపరచుకో లేని వాళ్ళకి. డబ్బు తీసుకోడు. విద్యాదానం అని గర్వంగా కళ్ళు మూసుకుంటాడు. మనిషి జీవితంలో ఒక్క డబ్బే ప్రధానం కాదు, మనిషికి నీతి, నిజాయితీ ఉండాలి. కొన్ని ప్రిన్సిపుల్స్‌కి కట్టుబడి ఉండాలి. అందుకే, అవినీతి మార్గాల ద్వారా డబ్బు చేసుకోటానికి ఎన్నడూ ప్రయత్నం చెయ్య లేదు. కాని రాను రాను అందుతున్న నెలసరి జీతం కనీస అవసరాలకు కూడా సరిపోవటం లేదు. దానికి తోడు సంఘానికి, సమాజానికి భయపడి అర్థంలేని ఆచారాలు పాటించడానికి తన కున్న సంపత్తిని ఉపయోగించుకోవలసి వస్తోంది అప్పుడప్పుడు.

* * *

# చేయి నీది!
# చెమట నీది!!

కదలిరావోయి కార్మికా!

కరమెత్తి సుత్తిపట్టి
ఈ ధారుణి సంపన్నము
చేయు శ్రామికా!!

వివాదాలు పరిస్థితుల
ప్రభావాలు పరిమార్చు
వివాదమే నీ బ్రదుకున
వింత మార్పు సమకూర్చును
వివాదాలు వినాదాలు —
శోషిత భేదాలు
కదలిరావోయి కార్మికా!

నీ చేయూ నీదైనను
మోచేతికి క్రింది బ్రదుకె!
నీ చెమటా నీదైనను
శ్రమ ఫలితము ఇంకొకరికె!
ఈ స్వార్థమునకై పోరు
హోరా హోరిగ జరుగ
నీ చేయూ నీ చెమట
నీది నీకునా మిగుల
కదలిరావోయి కార్మికా!

చేయి నీది చెమట నీది
శ్రమ ఫలిత మిక్కడను నీది
నిన్ను నీవు తెలుసుకొనిన
నిన్ను తెలుసుకొనును లోకం
ప్రగతి రూపు రేఖ లికను
ప్రజ్వలింప ప్రభవించగ
కదలిరావోయి కార్మికా!

— పులికంటి కృష్ణారెడ్డి

"ఏమండీ అమ్మాయి మణిని ఈ నెలలో తీసు కొచ్చి గాజులు పెట్టించాలండీ."

మౌనంగా విని ఊరుకొన్నాడు భాస్కరం. ఇదే ఇరవై ఏళ్ళ క్రిందట అయితే ఎంతో సంబర పడిపోయి ఉండేవాడు. ఎంతో హడావుడి చేసేవాడు. ఎంతమందికో ఈ వార్త అందజేసి ఉండేవాడు. కాని ఇప్పుడు పసుపు కుంకుమ పెట్టి, చీర, రవికలగుడ్డ కొందామన్నా పర్సు చూసుకోవలసిన పరిస్థితి వచ్చింది. అయినా కాలం ఏదో విధంగా దొర్లుతూనే ఉంది. వేడుకలు జరుగుతూనే ఉన్నాయి.

* * *

ఈలోగా పెదపర్తి వారి కేలెండర్లు మరో పదిహేను మారేయి.

* * *

"ఏమైనా ఉత్తరాలు వచ్చేయా?"

"అల్లుళ్ళు ముగ్గురూ పండక్కి వస్తున్నట్టుగా వ్రాశారు."

మౌనంగా విని ఊరుకున్నాడు భాస్కరం.

"పెద్ద అల్లుడు, చిన్న అల్లుడు సంసారాలతో పదిరోజులు సెలవు పెట్టి వస్తున్నట్టు వ్రాశారు."

"మంచిది."

"ఇంతమందికి బట్టలు పెట్టాలి — ఎలా గండీ?"

"ఏదో ఒకటి చేద్దాంలే"

"ఇదివరకు తెచ్చిన బట్టల తాలూకు బాకీయే ఇంతవరకు తీర్చనేలేదు."

"అయినా తప్పదు కదా—సంఘంలో బతుకుతున్నాం."

* * *


వేడుకలు ప్రేమానురాగాలను పెంచుతా యుంటారు. అంతా ఆదొక భ్రమ. ఇరవై ఏళ్ళ బట్టి భాస్కరం చూస్తున్నాడు. ఎంత పెట్టినా, ఎలా పెట్టినా, 'ఇంతేనా?' అనే మాటలతన చెవుల్లో పడుతూనే ఉన్నాయి. ఇంట్లో జరుగుతున్న వేడుకల్లు, కానుకలకు తోడు సమాజపరంగా అప్ప చెప్పబడిన మరి కొన్ని బాధ్యతలు. ఎవరింట్లోనో పుట్టిన దినం—ఎవరింట్లోనో కల్యాణం. లేకపోతే సీమంతం. ఉయ్యాల్లో వడుకో బెట్టడం ఇలా ఏదో ఒకటి. పిలిచిన ప్రతి కార్యానికి వెళ్ళి ఏదోవిధంగా, ఎంతో కొంత ముట్టచెప్పాలి. ఈ వేడుకలకు అర్థం వెతకటానికి వీల్లేదు. ఉన్నా, లేకపోయినా డబ్బు ఖర్చు పెట్టవలసిందే. బిస్కట్ల పొట్లం ఖరీదు కనీసం అయిదు రూపాయలు. రవికెలగుడ్డ పదిహేను రూపాయలు. ప్రెజెంటేషన్ అయితే ఇరవై అయిదు లోపు చూపనే చూపడు వీపు వాడు.

ముగ్గురు అల్లుళ్ళు ఒక్కొక్క గంట తేడాలో పండగ ముందురోజు దిగబడ్డారు. సరస్వతి పెరటి వసారాలో ఎక్కడో పని చేసుకొంటున్నది. భాస్కరం మాత్రం తప్పదు గదా అని ఏవో కుశల ప్రశ్నలు అడుగుతున్నాడు.

ఇంతకుముందు అయితే అమ్మాయి, అల్లుడు పండక్కి వస్తున్నారంటే, రెండు రోజుల ముందు నుండి ట్రెయిన్ వచ్చే టైముకి ఒక గంట ముందు నుండి వీధి గుమ్మంలో నిలబడి ఏదైనా రిక్షా వస్తుందేమోనని చూస్తుంటే సరస్వతి ఇప్పుడు తలుపులు తియ్యకుండానే ఇంట్లోనే కూర్చుని, రిక్షా చప్పుడు వినిపిస్తే, ఆ వస్తున్న రిక్షా పక్క వాళ్ళ ఇంటి దగ్గర ఆగిపోతే బాగుండును అని ఆలోచించే స్థితికి వచ్చింది.

* * *

మూడో అల్లుడు శేఖర్. కిందటి సంవత్సరమే ప్రవీణను ఇచ్చి పెళ్ళి చేశారు. శేఖర్ చాలా మంచి వాడు. మంచి మనసువాడు. ఏదో ప్రయివేటు కంపెనీలో ఆఫీసరుగా పని చేస్తున్నాడు. వెయ్యి రూపాయల వరకు వస్తుంది. పెళ్ళికి కానీ కట్నం తీసుకోలేదు. ఆడంబరాలంటే నచ్చవు. పెళ్ళిలో దుబారా ఖర్చు చెయ్యొద్దని ఆడుగడుగునా అడ్డం పడేవాడు. కన్యాదానం చేసిన అత్తగారు, మామగారు అంటే ఎనలేని గౌరవం. భాస్కరం, సరస్వతులకు కూడా ప్రవీణ అంటే ఎంతో ఇష్టం. ప్రవీణ




పెళ్ళి చెయ్యటానికి పరిస్థితులు మారేయి. పరిస్థితులు బాగున్నంతకాలం పెద్ద అల్లుళ్ళిద్దరు కుశలంగా వేడుకలు, కానుకల పేరు చెప్పి రాబట్టుకున్నారు. ఇప్పటికి పెళ్ళయి ఇరవై ఏళ్ళు అయినా, ఇంకా పెళ్ళీడు ఆడపిల్ల లున్నప్పటికీ పెద్ద అల్లుడు ఏ సంవత్సరమూ తప్పకుండా ఇరవై సంవత్సరాలనుండీ ప్రతి పండక్కి మొత్తం సంసారంతో దిగబడి, పదిరోజు లుండి భాస్కరం సంసారం గుల్ల చేసిన మరీ వెళ్తున్నాడు.

భాస్కరం పరిస్థితి శేఖర్ కనిపెట్టాడు. ఇంతకాలం అరువుగా బట్టలు కొనుక్కొనిస్తున్న సుబ్బిసెట్టి రెండు రోజులకై భాస్కరానికి కనబడకుండా తిరుగుతున్నాడు. తెలిసిన మిత్రు లెవరూ భాస్కరాన్ని ఆదుకోటానికి ముందుకు రావటం లేదు.

* * *

పండుగ మూడో రోజున లోపల గదిలో ఉన్న అత్తగారు, మామగారి దగ్గరకు శేఖర్ వెళ్ళి "మామయ్యగారూ! మీరేం అనుకో పోతే ఒక మాట—అందరికీ బట్టలు తెచ్చేను. పెద్దవారు. మీ ఇరువురి చేతుల మీదుగా ఇవి అందరికీ ఇవ్వండి."

"అదేమిటి—నాయనా! బట్టలూ అవీ మేం పెట్టాలి—అది ఆచారం."

"ఆచారం సరే కానీ. పరిస్థితుల బట్టి కూడా మనం నడుచుకోవాలి. నేను మీకు చెప్పేవాణ్ణి కాను. ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్న ఈ రోజుల్లో ఇంత మందికి బట్టలు పెట్టి, వాళ్ళను సంతోష పెట్టటం న్యాయాలు చేస్తూ నిజాయితీ జీవితం సాగిస్తున్న మీకు కష్టాన్ని కలిగించే పని."

"నాయనా, నీకు తెలీదు. ఇదొక ఆచారం. మాకు ఉన్నంతలో మేం పెట్టటం, మీరు స్వీకరించటం..."

"మామయ్యగారూ, ఆచారాల పుట్టు పూర్వోత్తరాలు నాకు తెలియవు గాని, ఈ ఆచారాలకు అర్థం అంటూ ఏదీ లేదని మాత్రం తెలుసు. ఇలాటి ఆచారాలకు ధనిక వర్గాల్లో అయితే ఒక అందం, మంచి గిరాకీ ఉంటుంది. ఎందుచేత అంటే, ఆ డబ్బు అక్కడ కక్కడే తిరుగుతుంది కాబట్టి. ఇలాంటి డబ్బు ఖర్చు ఆచారాలు మనలాంటి మధ్యతరగతి కుటుంబాలకు సరిపడవు."

"ఈ ఆచారం ఈనాటిది కాదు, నాయనా. మన వంశ పారంపర్యంగా వస్తున్నది."

"అలా అని చెప్పి ఉన్నా, లేకపోయినా సంసారం గుల్ల చేసి ఆచారం పాటించాలని ఎక్కడైనా రాసి పెట్టి ఉందా, మామయ్యగారూ! ఇంకా చిన్న పిల్లలున్నారు. వాళ్ళ భవిష్యత్తు కూడా మీరే తీర్చి దిద్దాలి. అర్థం లేని ఆచారాలకు ఆ చిన్న పిల్లల భవిష్యత్తు బలి చెయ్యకండి. ఇక ఆనందం, సరదా అంటారా— మనందరం కలియటమే ఒక ఆనందం. మనం అందరం కలిసి భోజనం చెయ్యటం, కలిసి హాయిగా నవ్వుతూ కబుర్లు చెప్పుకోవటం కన్నా మించిన వేడుక ఇంకేముంటుంది? ఇలాగే మొండి—కానుకలు లేకుండా వేడుకలు చేసుకో లేదా? అందుచేత దయచేసి నా మాట తోసి పారెయ్యకండి. మీరు పెద్దవారు. మీ ఉభయుల చేతుల మీదుగా ఈసారికి ఈ బట్టలు అందరికీ అందచెయ్యండి. నా మట్టుకు నాకు మీరు అంద చేసే కానుకల కన్నా మీరు కురిపించే మీ ఆశీస్సులే నాకు ముఖ్యం."

ఆ విధంగా ముగిసింది ఆ సంవత్సరం పండగ.

మరుసటి సంవత్సరం...

ఆనవాయితీ ప్రకారం పండక్కి అల్లుళ్ళు ముగ్గురినీ ఆహ్వానించటానికని మూడు పోస్టు కార్డులు ముందు పెట్టుకొని కూర్చున్నాడు భాస్కరం.

ఇంతలో 'పోస్ట్' అని కేక వినపడటం, పోస్టుమన్ ఒక ఉత్తరం ఇచ్చి వెళ్ళటం జరిగింది.

"ఎక్కడ నుండి?" మామూలుగానే సరస్వతి ప్రశ్న.

"అల్లుడు శేఖర్ నుండి—చదువుతా, విను."

"పూజ్యులు మామగారికి నమస్కరించి వ్రాయునది. ఇక్కడ మీ అమ్మాయి, నేనూ క్షేమంగా ఉన్నాము. మీరంతా క్షేమంగా ఉన్నారని తలుస్తాను.

క్రితం సంవత్సరం పండక్కి నా ప్రవర్తన మిమ్మల్ని బాధించిన ఎడల నేను క్షంతవ్యుడను.

ఈ మధ్య మా అన్నగార్లతో సమానులైన మా తోటి అల్లుళ్ళు ఇద్దరికీ ఉత్తరాలు వ్రాశాను. ఈ సంవత్సరం పండగకు ఎప్పుడు బయలుదేరి అక్కడకు చేరుకొంటున్నారో తెలియపరిస్తే నేను కూడా ఆ వేళకు అక్కడకు చేరుకొంటా నని. వా రిరువురు వెంటనే సమాధానా లిచ్చేరు. పండగకు మామగారింటికి వెళ్ళటంలేదని. కారణం వ్రాయలేదు. బహుశా వా రిరువురకు తెలిసి ఉంటుంది, క్రితం సంవత్సరం పండగలో బట్టల ఖర్చు నేను భరించినట్లు. అదీ ఒకందుకు మంచిదే. మీ రేం విచారించవలసిన పని లేదు. వాళ్ళని కూడా వాళ్ళ ఇళ్ళల్లో పండగ చేసుకోనిండి. వాళ్ళకి కూడా పండగ ఖర్చు, ఆ వ్యవహారం బోధపడుతుంది.

అయితే ఈసారి పండగకు వారిరువురు అక్కడకు రాలేదు గాబట్టి, నా దొక చిన్న విన్నపం.

మీరు, అత్తగారు పిల్లలతో సహా అందరూ ఈసారి పండగకు మా ఇంటికి వచ్చి, మాతో పాటు గడిపితే మే మెంతో సంతోషిస్తాము. మీరు అన్యథా భావించకండి. ఎవరు ఎవరింటికి వెళ్ళే రన్నది ప్రశ్న కాదు. అందరూ ఒక చోట ఆనందంగా, ఆడంబరం లేకుండా, హాయిగా పండగ చేసుకోవడం ముఖ్యం. అకపోతే లోకం ఏమను కొంటుందో అన్న ప్రశ్న. మీ రేం చేసినా సంఘం వేలెత్తి చూపుతుంది. చెయ్యకపోతే చెయ్యలే దంటుంది. మీరు అవసరంలో ఉంటే మాత్రం మీ దరికి రాదు. అలాంటి సంఘాన్ని, సమాజాన్ని కొంతకాలం మరిచిపొండి.

తప్పక నా ఆహ్వానం మన్నిస్తారని ఆశిస్తాను.

మీ ప్రయాణ ఖర్చుల నిమిత్తం డబ్బు మనీ యార్డరు చేసేను. తిరిగి పంపి వేయకుండా తీసుకొని, మీరందరూ ఈసారి పండగకు మా ఇంటికి వస్తే మా కెంతో ఆనందంగాను, హాయిగాను ఉంటుంది.

ఇట్లు,
—శేఖర్." ✱

